TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 152 | మంగళవారం 26-05-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-



విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...


## కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

### ఆదానీ, అంబానీలను మించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి





- మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి
- రుణపరిమితి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నాం
- రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
- వర్చువల్ గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు.
తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు.

2లో

## ముగ్గురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల రాజీనామా



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన అన్నాడీఎంకే (ఏఐఏడీఎంకే)కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. సోమవారం ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, ఆ తర్వాత టీవీకే మంత్రి ఆదవ్ అర్జునను కలిశారు. మరగతం కుమారవేల్, జయకుమార్, సత్యభామ తమ రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు సమర్పించారు. పేజి 2లో ▶

## ప్రధాని మోదీతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భేటీ



- దిల్లీలో ప్రధాని మోదీతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భేటీ
- సేవా తీర్థ్‌లో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చ
- అటల్ స్మృతి న్యాస్ సొసైటీ ఛైర్మన్‌గా వెంకయ్యనాయుడు బాధ్యతలు

2లో

## కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్



హైదరాబాద్: బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదన్నారు. పేజి 2లో ▶

## అంతర్‌రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం




- తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు చర్చలలో పూర్తి ప్రాధాన్యత
- పరస్పర అవగాహనతోటే కృష్ణా జలాల వినియోగం
- రెండు రాష్ట్రాల త్రాగునీటి అవసరాలపై కలిసి పోయే విదంగా చర్యలు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

నీటివినియోగంపై ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షణకు అనుకూలంగా ఉండే విధంగా రెండు రాష్ట్రాల మధ్యన ఒడంబడిక కుదుర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణా-కర్ణాటక రాష్ట్రల మధ్యన కృష్ణా జలాల వినియోగం, త్రాగు,సాగునీటి అవసరాలపై కర్ణాటక రాష్ట్ర చిన్ననీటి తరహా శాఖామంత్రి బోసురాజు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తో డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో సోమవారం రోజు భేటి అయ్యారు. పేజి 2లో ▶

## డైమండ్ హార్బర్‌లో బిజెపి అడుగు

- గోదావరి పుష్కరాలకు 10కోట్ల మంది
- అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు ఉండాలి
- రాజమహేంద్రిలో అధికారులతో పవన్ సమీక్ష



గోదావరి పుష్కరాలకు సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, అందుకు తగిన విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల-2027 ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో పుష్కరాల ఏర్పాట్లపై రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పనులు ఎలా జరుగుతున్నాయని అధికారులను అడిగి డిప్యూటీ సీఎం తెలుసుకున్నారు. ఈ క్రమంలో అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అధికారుల పనితీరుపై డిప్యూటీ సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏడాది వ్యవధిలో రూ. 8,600 కోట్లతో చేపట్టాల్సిన పనులకు ఇంకా డీపీఆర్‌లు ఎందుకు సిద్ధం కాలేదని ప్రశ్నించారు. పేజి 2లో ▶

## పద్మపురస్కారాన్ని స్వీకరించిన హర్మన్ ప్రీత్ కౌర్



2లో

## బిఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

- ప్రతి ఇంటికీ మంచి నీరు అందించి తీరుతాం
- నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు ఒక్కటూనా కట్టారా
- అలా చూపిస్తే రాజకీయాల నుంచి తప్పకుంటా
- సర్ ప్రక్రియతో జాగ్రత్తగా ఉండాల్సిందే
- కూకట్‌పల్లి కార్యకర్తల భేటీలో బిఆర్ఎస్ నేత కెటిఆర్



మిగతాది 2లో


## అత్తారింట్లో విద్యుదాఘాతం.. అల్లుడి మృతి



ఆత్మకూరు (అమరచింత): అత్తారింట్లో శుభ కార్యానికి వచ్చిన అల్లుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లాలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. అమరచింత మండలం ఈర్లదిన్నె గ్రామానికి చెందిన ఆంజనేయులు (42) శనివారం ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలోని అత్తారింటికి వెళ్లారు. సోమవారం ఉదయం బావమరిది కుమారుడి తొట్టెల కార్యక్రమం ఉండటంతో ఇంటిని నీటితో శుభ్రం చేయడం కోసం నీరు అవసరమని మోటారు ఆన్ చేయడానికి బోర్డు వద్ద స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయి పడిపోయారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై జయన్న తెలిపారు.

## ఇశాన్వీ నుంచి బయటకు వచ్చాం

- నోటీసులపై 27న వివరణ ఇస్తాం
- విజయవాడ ఎంపి కేశినేని చిన్ని




2లో

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక
మంగళవారం 26-05-2026

# సంపాదకీయం

## ప్రతి కథా ఏకలవ్యుడి బొటన వేలే!




'ఎస్టీ కాలనీ' అని పిలవబడే ఒక ఎరుకుల సమూహాన్ని 'ఏకలవ్య కాలనీ'గా పిలుచుకోవడం వెనుక ఆ ఊరి యువత ఆలోచన బైటి నుంచి చూస్తే సాధారణమైనదిగా కనపడవచ్చు. కానీ పలమనేరు బాలాజి 'ఏకలవ్య కాలనీ -- ఎరుకల జీవనగాథలు' పుస్తకం చదివినాక ఆలోచిస్తే ఆ ప్రయత్నం మామూలుది కాదు అనిపిస్తుంది. స్వతంత్ర భారత దేశంలో మూలవాసులైన గిరిజనులపై వారి వారి జీవన విధానాల ఆధారంగా రాజ్యం రాసిన నెగెటివ్ హిస్టరీని రీరైట్ చెయ్యాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తాయి ఈ పుస్తకంలోని కథలు.

అడవి తీరప్రాంతాన, వ్యవసాయ ప్రధానంగా జీవనం సాగిస్తున్న ఒక ఆదిమ సమాజం దొంగలుగా చిత్రించబడటం ఒక కుట్ర. ఒక సమూహాన్నే వెలి వేయడం, నిర్లక్ష్యంగా పక్కన పెట్టడం ఒక వ్యూహం. అందులో భాగంగానే పాలకుల తీరు, ఇతర సమాజాల అణచివేత ఒక పథకం ప్రకారం జరుగు తున్నదని మనకు అర్థం చేయిస్తుంది ఈ పుస్తకం. ఈ కథల్లో ఒక కాలేజీ కుర్రాడు కొత్త ఫోను పట్టుకుని కాలేజీకి వెళ్తే "యాడ కొట్టుకొస్తివిరా ఇంత కొత్త ఫోను" అని ప్రశ్నిస్తుంది ఇతర సమాజం. అదే కథలో మరోచోట "మీకే మప్పా, మీరు దేవుడి బిడ్డలు. రిజర్వేషన్లున్నాయి" ఎత్తి పొడుస్తుంది. మరి స్వతంత్ర స్వర్ణోత్సవ సమయానికి ఈ పాత్ర తండ్రి ఎలా జీవించి వుంటాడు? ఎన్ని అవమానాల్ని ఎదుర్కొని వుండివుంటాడు? ఆ ముందు తరం ఏ మానసిక వేదనని మోస్తూ దాన్ని నేటి తరానికి వారసత్వంగా ఇచ్చి వుంటుంది? "అభివృద్ధి, మార్పు, సమానత్వం అనేవి రావడానికి ఇంకా ఎన్నేళ్ళు వెయిట్ చెయ్యాలి సార్?" అని మరో చోట ప్రశ్నిస్తుంది ఇదే కథలో మరో పాత్ర. ఈ మాటలో వెయిటింగ్ పట్ల అసహనం కనిపిస్తుంది. ఇది తరాల నిరీక్షణ.

ఈ పుస్తకంలో ఒక చోట ఆ ఎస్టీ కాలనీలో ఒక దృశ్యం పాఠకుడికి ఇలా ఎదురవుతుంది: "గుడి పక్కనే ఒక మొండి గోడల ఇల్లు... తలుపు సగం ఊడిపోయి, ఎప్పుడూ మూయాల్సిన అవసరమే లేనట్టు. బయటే నులక మంచం పైన ఒక సగం మనిషి కూర్చునో లేదా పడుకునో ఉంటాడు. పగల్లో కానీ, రాత్రుల్లో కానీ అతడు నిద్రలోకి వెళ్ళి వస్తుంటాడు. మెలకువలో కూర్చుని గుడ్డ పేలికలతో తాడు పేనడమో, వెదురు దబ్బల్తో తట్టో, బుట్టో, చాటో అల్లడమో చేస్తుంటాడు. రాత్రని, పగలని అతడికి స్పృహ ఉండదు. వానా, చలి, ఎండా ఏ తేడా తెలీదు. అతడి లోకం అతడిదే." ఈ వర్ణనతో అక్కడి దృశ్యం క్రమక్రమంగా మనకు స్పష్టమవుతూ కనిపిస్తూ వుంటుంది. అక్కడి మనుషుల జీవన విధానం, అక్కడి పరిస్థితులూ ఒక్కొక్కటిగా మనకు అర్థమవుతూ వుంటాయి.

ఇందులో ఆ "సగం మనిషి"ని మనకు చెప్పడానికి రచయిత అక్కడి మైన్యూట్ ఇష్యూస్‌ని కథలోకి తీసుకురావడాన్ని అభినందించకుండా వుండలేం. ఇలా చెప్పాలంటే ఆ రచయిత కచ్చితంగా ఆ కాలనీలో నివసించే వ్యక్తే అయి వుండాలి. లేదా అక్కడ జీవితాలతో ప్రత్యక్ష అనుబంధాలను కలిగి వుండాలి. లేకపోతే ఈ విధమైన నెరేషన్ వీలుకాదు.

ఇందులో ఒక పాత్ర మనతో చెప్తుంది: "ఒకరి బాధలు ఒకురికి చెప్పుకోవల్లంటే ఒకరి కష్టానికి ఒకురు రావల్లంటే అంతా ఒక్కచోట వుంటే మంచిది కదా వదినా" అని. ఎవరి బతుకు బాధల్లో వాళ్ళు ఎవరికి వారై వేరై పలుచోట్లకు పోతుంటే, ఎదురైన పీడనని ఎదుర్కోవడం సాధ్యం కాదనే స్పృహ అంతర్లీనంగా ధ్వనిస్తుందీ మాటల్లో. "పందుల్ని మేపినా, గాడిదల పైన ఉప్పు అమ్మినా, తట్టా బుట్టా అమ్మినా, యెర్రమన్ను, ముగ్గుపిండి అమ్మినా మనల్ని అడిగేవోడు లేదు. మన కాళ్ళపైన మనం నిలబడి మన కష్టం తింటూ ఉండామే కానీ ఉన్నప్పుడు తిని, లేనప్పుడు పస్తయినా వుండామే కానీ ఏ పొద్దూ ఎవరి సొత్తుకు అయినా పోతాండామా," అని అదే పాత్ర చెప్తూన్నపుడు మనకి ఆ మనుషుల బతుకు చిత్రాలు కనిపిస్తాయి. వృత్తులు స్పష్టమవుతాయి. కష్టాలు, కన్నీళ్ళు, బాధలు, బరువులూ అర్థమవుతాయి. "ఇప్పుడు వాళ్ళందరూ ముసలి వాళ్ళయిపోయారు, వాళ్ళను కదిలిస్తే చాలు కన్నీళ్ళు జలజలా నేల రాల్తాయి. బతుకుదారులు వేరైనా వాల్లందరివీ కంటికి కడవెడు కన్నీళ్ళు నింపుకున్న కతలే" అని రచయితే ఒక చోట అంటాడు. అతని మాటల్లో ఆ నేలరాలిన కన్నీళ్ళని రికార్డు చెయ్యాలనే తపన కనిపిస్తుంది. ఈ వ్యథలు బయటి ప్రపంచానికి తెలియచెప్పాలన్న సంకల్పం కనిపిస్తుంది. ఇదా మన భారతం అని ఎవరినో ప్రశ్నిస్తున్నట్టనిపిస్తుంది.

'ఏకలవ్య కాలనీ' సంపుటిలోని కథలన్నీ ఒక ప్రశ్నతో ముగుస్తాయి. ముగిసిన తరవాత పాఠకునిలో ఒక అలజడికి, ఆలోచనకి కారణమవుతాయి. ఈ ప్రశ్నలన్నీ పాఠకుడిలో ఒక మెలకువని కలిగిస్తాయి. అంటే కథ ముగిసిన తరువాత మథనం ప్రారంభమవుతుంది. అదే కదా సాహిత్యం అంతిమ లక్ష్యం. ఆ పని సులభంగా చేస్తాయీ కథలు.

ఇదంతా ఎందుకు చెప్పాల్సొస్తుందంటే: ఇవన్నీ ఎరుకల కథలు. ఇంతదాకా ఎవరూ తడమనివి. తడిమినా ఇంత లోతుల్లోంచి చెప్పినవి కాదు. పలమనేరు బాలాజీ ఇప్పటికే కథకునిగా, కవిగా అందరికీ పరిచయమైనవారు. నా అంచనా తప్పు కాకపోతే ఆయన ఇంతకుముందు రాసిన పలు కథాకవిత్వాలకూ, ఈ పుస్తకానికీ స్పష్టమైన తేడా వుంది. అది అస్తిత్వ పరామర్శ. నా ఉద్దేశ్యం వాటిల్లో ఈ స్పృహ లేదని కాదు. ఇందులో బలంగా వున్నదని.

ఇన్నాళ్ళూ వివక్ష, అణచివేత, పీడనలు దళితజీవితాల్లో మాత్రమే ఉన్నాయ నుకునేది సమాజం. అంటరానితనం ఒక్క దళితులకు మాత్రమే ఎదురయ్యేది అనే అవగాహన వుండేది. కానీ అంటరానితనం గిరిజన కులాల్లో కూడా ఒక ముల్లులా గుచ్చుకుంటున్నదన్న వాస్తవాన్ని చెప్పే ప్రయత్నం చేసాయి ఈ కథలు. నొప్పిని భరిస్తున్న కమ్యునిటీస్ లోంచి ప్రశ్నించడం మొదలయ్యింది అని ప్రకటిస్తున్నాయి ఈ కథలు.

ఈ కథల్లో ఒక పాత్ర అంటుంది: "ఈ దేశానికి ఒక్క అంబేద్కర్ చాలడు. ఇంటికొక్క అంబేద్కర్ రావల్ల" అని. ఎనభైయ్యేళ్ళ ఆ పాత్ర అంబేద్కర్‌ని అణువణువునా జీర్ణించుకున్న ఉడుకోడు పాత్ర. "ఎరికిలోడు సేద్యం ఒక్కటే నేర్చుకుంటే సాలదు మామా, పోరాటం చెయ్యడం నేర్చుకోవల్ల, బతకాలంటే కరువుతోనే కాదు, మొండిమేఘాలతోనే కాదు, మొండి మనుషులతో, పెద్ద కులమోళ్ళతో పోరాటాలు చెయ్యడం నేర్చుకోవల్ల" అని ఉడుకోడు తోటి వారిని చైతన్యపరుస్తుంటే-- ఆ ఒక్క ఎస్టీ కాలనీకి చెందిన వారికే కాదు పీడితులందరికీ తత్వబోధ చేస్తున్నాడని మనకి ఇట్టే అర్థమైపోతుంది. "బతికేదానికి వయసుతో పనేముంది మామా, ఏ వయసోడికైనా బతకాలంటే నెత్తురు ఉడుగ్గానే ఉండల్ల. అసలు మనిషనేవాడు ఎప్పుడూ ఉడుకుడుగ్గానే ఉండల్ల," అని కుండబద్దలుకొట్టినట్టు చెప్తుంది ఉడుకోడు పాత్ర.

సాహిత్యలోకంలో బలహీనంగా వున్న గిరిజన స్వరం బృందగానంగా మారడానికి గొంతెత్తిన చైతన్యస్వరమీ కథలు. కథల్లో, కవితల్లో ఇప్పుడిప్పుడే గొంతు విప్పుతున్న గిరిజన గళాలకి ఈ కథలు మార్గనిర్దేశం చేస్తాయి. వివిధ ఉపకులాలుగా వున్న అడవి బిడ్డలకు ఈ కథలు కొత్త పాఠాలు నేర్పుతాయి. ప్రతి ఉపకులం నుంచీ ఇలాంటి కథలు రావాలన్న సందేశాన్ని పంపుతాయి.

# ఇశాన్వీ నుంచి బయటకు వచ్చాం

మొదటిపేజీ తరువాయి

ఇశాన్వీ, కేశినేని డెవలపర్స్ సనీస్థలు కలిసి చేసిన రియల్ ఎస్టేట్ సంస్థకు ఈడీ అధికారుల నుంచి ఓ నోటీసు వచ్చిందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఆ కంపెనీకి వచ్చిన నోటీసుపై ఈనెల 27వ తేదీన వివరణ ఇస్తామని పేర్కొన్నారు. పక్క పక్క సైట్లు ఉండటంతో రాజ్ కసిరెడ్డికి సంబంధించిన ఇశాన్వీ సంస్థతో 2021లో రియల్ ఎస్టేట్ చేసేందుకు ప్రైడ్ ఇన్‌ఫ్రా సంస్థ ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. ఆ సంస్థ ద్వారా రూ.35 లక్షల లావాదేవీలు జరిగాయని తెలిపారు. సోమవారం విజయవాడలో కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడారు. రాజ్ కసిరెడ్డి సంగతి తెలిశాక 2022లోనే.. ఆ కంపెనీ నుంచి బయటకు వచ్చేశామని కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. ఆ లావాదేవీకి సంబంధించే ఈడీ అధికారులు సమాధానం కోరుతూ నోటీసు పంపించారని వెల్లడించారు. ఆర్కిటెక్ ఫీజు కోసం చేసిన రూ.35లక్షల ట్రాన్సాక్షన్ తప్ప ఇంకేమి జరగలేదని ఈడీ అధికారులకు చెబుతామని తెలిపారు. లిక్కర్ స్కామ్‌లో తన భార్యకు నోటీసులు వచ్చినట్లు వచ్చిన ఆరోపణలు అవాస్తవమని అన్నారు. అప్పుడు పెట్టిన కంపెనీలో తన భార్య ఒక డైరెక్టర్ మాత్రమేనని తేల్చిచెప్పారు. ఆ కంపెనీకి నోటీసు వచ్చిందే తప్ప.. తన భార్యకు ఎలాంటి నోటీసు రాలేదని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

# కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్

మొదటిపేజీ తరువాయి

"వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. జూన్ 1న మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుడతాం. హైదరాబాద్‌లో 3 కార్పొరేషన్లలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించబోతున్నాం. అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం. చెల్లి, బావ ఫోన్లు ట్యాప్ చేసిన కేటీఆర్‌కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత లేదు" అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు.

# అంతర్‌రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

భేటీలో రాష్ట్ర ఎక్సయిజ్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, క్రీడల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా శాఖా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి రాయచూరు లోకసభ సభ్యులు జీ. కుమార్ నాయక్,నాగర్ కర్నూల్ లోకసభ సభ్యులు మల్లు రవి లతో పాటు రాయచూరు రూరల్ శాసనసభ్యులు బసన్నగౌడ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,మేఘారెడ్డి,శివకుమార్ రెడ్డి,వంశీకృష్ణ,రాష్ట్ర నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ. ఎన్.సి రమేశ్ బాబు,కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖా కార్యదర్శి బి.కే పవిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల వినియోగంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో అనుసరించ బోయే విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనాకారిగే ఉండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్ల కుండా ఉండేలా అనుసరించాల్సిన ప్రతిపాదనలను కర్ణాటక చిన్న నీటి తరహా శాఖామంత్రి బోసురాజు కు సమగ్రంగా వివరించినట్లు ఆయన తెలిపారు.కృష్ణా నదిపై ప్రతిపాదిత బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతికత అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణా సాగునీటి, త్రాగునీటి హక్కులు పరిరక్షణ భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధి విధానలపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలు కర్ణాటక ముందుంచినట్లు ఆయన చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఉభయ రాష్ట్రాల చర్చలలో తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి చర్చించినట్లు ఆయన తెలిపారు.సాగునీటి, త్రాగునీటి విషయంలో రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్ల కుండా ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విదంగా కృష్ణా జలాల వినియోగం పై కూలంకషంగా రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జాతిగాయని ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల మద్యన జరిగిన చర్చలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి వివరించి సమిష్టి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# పద్మపురస్కారాన్ని స్వీకరించిన హర్మన్ ప్రీత్ కౌర్

మొదటిపేజీ తరువాయి

ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాన్ని భారత మహిళల కెప్టెటన్ హర్మన్ ప్రీత్ కౌర్ స్వీకరించింది. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులు మీదుగా హర్మన్‌ప్రీత్ పద్మ శ్రీ అవార్డును అందుకున్నారు. టీమిండియా కలను సాకారం చేసి.. మహిళా క్రికెట్ వికాసానికి తోడ్పడిన ఆమెను ఈ సందర్భంగా ముర్ము అభినందించారు. పద్మశ్రీకి ఎంపికైన రోహిత్ శర్మ మాత్రం అవార్డు వేడుకలో కనిపించలేదు. నిరుడు సొంతగడ్డపై భారత జట్టుకు వన్డే ప్రపంచకప్ కట్టబెట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. 48 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ టీమిండియాను విశ్వవిజేతగా నిలిపింది. దిగ్గజ కెప్టెన్లు డయానా ఎడుల్జి, శాంత రామస్వామి, అంజుమ్ చోప్రా, మిథాలీ రాజ్ వంటి వాళ్లకు సాధ్యమవ్వని ఘనతను సొంతం చేసుకున్న కౌర్‌ను భారత ప్రభుత్వం పద్మ శ్రీతో సత్కరించింది. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం సంప్రదాయ దుస్తుల్లో హాజరైన హర్మన్‌ప్రీత్ ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము చేతులు మీదుగా అవార్డును అందుకుంది. నవంబర్ 2న జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించిన భారత జట్టు తొలిసారి జగజ్జేతగా అవతరించింది.

# బిఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైదరాబాద్ సిటీలో 24 గంటల తాగునీటిని సరఫరా చేస్తామని మాజీమంత్రి కెటిఆర్ అన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన తీరుగానే ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణకు 24 గంటల కరెంట్ ఇచ్చింది కేసీఆరే అని.. హైదరాబాద్ లో 24 గంటల తాగునీరు ఇచ్చేది కూడా కేసీఆరే అని వెల్లడించారు. కాంగ్రెస్ పరిపాలన గురించి అవగాహన ఉంది కాబట్టే నగర ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని మాజీ మంత్రి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, భవనాలను ఓపెన్ చేస్తూ తామే చేశామని అబద్దాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో కేవలం అభివృద్ధిపైన మాత్రమే దృష్టి సారించామని.. ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీకి అండగా ఉన్న కార్యకర్త, నాయకుడికి తగిన అవకాశం, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

# ముగ్గురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల రాజీనామా

మొదటిపేజీ తరువాయి

ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో టీవీకే (ఎంఖ) ప్రభుత్వానికి.. సీవీ షణ్ముగం నేతృత్వంలో 20 మందికి పైగా అన్నాడీఎంకే అసమ్మతి ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. వారిలో ఇప్పుడు రాజీనామా చేసిన వారు కూడా ఉన్నారు. దీంతో మదురాంతకం, ధారాపురం, పెరుందురై నియోజకవర్గాలు ఖాళీ అయ్యాయి. ఇప్పుడు మళ్లీ అక్కడ ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మాజీ సీఎం పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. వరుసగా రెండోసారి అధికారానికి దూరం కావడంతో పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తమైంది. దాంతో విజయ్‌కు మద్దతు ఇచ్చే విషయంలో పార్టీ రెండుగా చీలిన సంగతి తెలిసిందే.

# ప్రధాని మోదీతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భేటీ

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భేటీ అయ్యారు. దిల్లీలోని సేవా తీర్థ్‌లో ఆయనతో సమావేశమయ్యారు. వెంకయ్యనాయుడు 2025 డిసెంబర్ నుంచి అటల్ స్మృతి న్యాస్ సొసైటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. దిల్లీలోని వాజ్‌పేయీ స్మారకమైన 'సదైవ్ అటల్' నిర్మాణం మొదలు ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలను కూడా ఈ సొసైటీనే చూస్తోంది. ఈ నేపథ్యంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ ఆలోచనలు, సిద్ధాంతాలు, విలువలను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు సొసైటీ తరఫున రూపొందించుకోవాల్సిన విధివిధానాలపై ప్రధానితో వెంకయ్యనాయుడు చర్చించారు.

# డైమండ్ హార్బర్‌లో బిజెపి అడుగు

మొదటిపేజీ తరువాయి

ఒకే సంవత్సరంలో 7 వేల పనులను ఎలా పూర్తి చేస్తారని నిలదీశారు. ముఖ్యంగా పుష్కరాల నిర్వహణలో టూరిజం శాఖ నుంచి సరైన సన్నద్ధత ఎందుకు కనిపించడం లేదని మందలించారు. ఇష్టానుసారంగా ఖర్చు పెడదామని అనుకుంటే కేంద్రప్రభుత్వం నిధులు ఇవ్వదని స్పష్టం చేశారు. ప్రణాళికాబద్ధంగా, నాణ్యతతో పనులు చేయాలని దిశానిర్దేశర చేశారు. హడావిడిగా పాచిపోయిన సిమెంట్‌తో పనులు చేస్తే అవి కూలిపోతాయని హెచ్చరించారు. గత పుష్కరాల్లో జరిగిన తొక్కిసలాట వంటి ఘటనలు మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. గోదావరి పుష్కరాలు అంటే కేవలం రాజమండ్రికే పరిమితం కాదని, 6 జిల్లాల్లోని 274 పంచాయతీల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని ప్రాంతాల్లో భక్తులకు సమాన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పుష్కరాల పనుల సన్నద్ధతపై రాష్ట్ర కేబినెట్‌లో చర్చిస్తామని వెల్లడించారు. కేంద్ర నిధుల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వద్దకు వెళ్లే సమయంలో అన్నివిధాలుగా సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. గోదావరి నదిలో భక్తులు మురికినీళ్లలో స్నానం చేయడం సరికాదని పేర్కొన్నారు. గోదావరి కాలుష్య నివారణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు. అలాగే, తూర్పుగోదావరి జిల్లా అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో గోదావరి నది కాలుష్యానికి కారణాలపై ఆరా తీశారు. క్లీన్ కృష్ణా, గోదావరి మిషన్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశ్రమ వ్యర్థాలు ఎట్టి పరిస్థితుల్లోనూ నదుల్లో కలవకూడదని హుకుం జారీ చేశారు. పరిశ్రమ వ్యర్థాలపై పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలుషిత నీరు సాగునీటి కాలువల్లో కలవకుండా చర్యలు చేపట్టాలని మార్గనిర్దేశర చేశారు. మురుగునీటిని శుద్ధి చేశాకే నదులు, కాలువల్లో కలపాలని సూచించారు. మురుగునీటి హాట్ స్పాట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని నిర్దేశిరచారు. కాలుష్య నివారణకు కలెక్టర్లు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీల్లో మురుగునీరు ఎందుకు శుద్ధి చేయట్లేదని ప్రశ్నించారు. మురుగునీటిని నేరుగా పంట కాలువల్లో ఎందుకు కలిపేస్తున్నారని నిలదీశారు. నదిలో, తాగునీటిలో మురుగునీటిని కలపడం సరికాదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

మొదటిపేజీ తరువాయి

ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని

ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు.

# మేడ్చల్ లో ఉగ్ర లింక్ కలకలం..పాకిస్తాన్ ఐఎస్ఐతో టచ్‌లో ఉన్న జావెద్ ఖాన్ అరెస్ట్

మేడ్చల్ జిల్లా / ప్రజాదివాస్ మే 25
మేడ్చల్ జిల్లాలో ఉగ్రలింకుతో ఒక్కసారిగా కలకలం రేగింది. పాక్ ఐఎస్ఐ ఏజెంట్లు, ఉగ్రవాద ముఠాతో సంబంధాలున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేయడంతో హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలు ఉలికిపడ్డాయి. ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌కు చెందిన జావెద్ ఖాన్ ఫిబ్రవరిలో మేడ్చల్‌కు వచ్చి ముబారక్ హోటల్‌లో వెయిటర్‌గా పని చేస్తున్నాడు.జావెద్ ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ తుపాకులతో చేసిన రీల్స్ చేయడంతో పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ సానుభూతిపరులు రాణా హుస్సేన్, హబీబ్ అతనితో కాంటాక్ట్‌లోకి వచ్చారు. వీరికి పాక్‌లోని ఐఎస్ఐ తీవ్రవాది షెహబాద్‌తో ప్రత్యక్ష సంబంధాలున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ ముఠా జావెద్‌ను తమ గ్రూపులోకి లాగేందుకు ప్రయత్నించగా, వాడు నిరంతరం వారితో టచ్‌లో ఉన్నాడు. తాను పాకిస్తాన్ వచ్చి ఉగ్రవాద శిక్షణలో పాల్గొంటానని మాట్లాడాడు. పాక్ ఉగ్రవాదులు పెట్టిన పరీక్షలో భాగంగా, జావెద్ కొంతమంది వీఐపీల సమాచారంతో పాటు దేశ భద్రతకు సంబంధించిన విషయాలను వారికి షేర్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.ఉగ్రవాదంపై ఆకర్షితుడైన జావెద్ చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అతడికి అసలైన తుపాకులు సరఫరా చేస్తామని ఐఎస్ఐ సానుభూతిపరులు హామీ ఇచ్చినట్లు తెలిసింది. నిందితుడు వాయిస్ కాల్స్, చాటింగ్ ద్వారా వారితో టచ్‌లో ఉన్నట్లు ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. పోలీసులు, ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాలు ప్రతి అంశాన్ని లోతుగా విచారిస్తున్నాయి. జావెద్ డిలీట్ చేసిన ఇన్‌ఫర్మేషన్‌పై ఆరా తీస్తున్నారు. పాక్




ఉగ్రవాదితో మాట్లాడినట్లు, ఆయుధాలు సమకూర్చుకునేందుకు ప్రయత్నించినట్లు విచారణలో బయటపడింది. నిందితుడి వద్ద నుంచి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, వాట్సాప్ చాట్లు, వాయిస్ కాల్స్, స్క్రీన్‌షాట్లను పరిశీలిస్తున్నారు. నిందితుడి వద్ద నుంచి రెండు నకిలీ పిస్టల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జావెద్‌ను అరెస్టు చేసిన మేడ్చల్ పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు.

# వేములవాడ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ముగిసిన సమ్మర్ క్యాంప్




వేములవాడ/ప్రజాదివాస్ మే 25
వేములవాడలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం గత 15 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు (సమ్మర్ క్యాంప్) సోమవారం నాటితో ఘనంగా ముగిశాయి. ఈ క్యాంప్‌లో విద్యార్థులకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, క్లాసికల్ డాన్స్, ఇండోర్ గేమ్స్, గణితంలో సులభమైన పద్ధతుల పై నిపుణులతో ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవి కాలాన్ని వృధా చేయకుండా, తమలోని సృజనాత్మకతను మరియు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇలాంటి శిక్షణా శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. 15 రోజుల పాటు క్రమశిక్షణతో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఉపయోగించుకోవాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ముగింపు కార్యక్రమంలో ఉపాధ్యాయులు కట్ట రవీందర్, రాజు, క్రాఫ్ట్ టీచర్ స్వరూపలతో పాటు ఇతర శిక్షకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి వర్చువల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆరెపల్లి సర్పంచ్ ఇటిక్యాల రాజు

**- ఆరెపల్లిలో మహిళా సంఘ భవన పనులకు ఘనంగా శ్రీకారం**
**- కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించిన సర్పంచ్ ఇటిక్యాల రాజు**

వేములవాడ ప్రజాదివాస్ మే 25
వేములవాడ అర్బన్ మండలం ఆరెపల్లి గ్రామంలో మహిళా సంఘ (ఏూా) భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి వర్చువల్ విధానం ద్వారా ఏకకాలంలో అన్ని గ్రామాల్లో మహిళా సంఘ భవనాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, ఆరెపల్లి గ్రామంలోని వీఓ బిల్డింగ్ ప్రాంగణంలో స్థానిక సర్పంచ్ ఇటిక్యాల రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ ఇటిక్యాల రాజు, ఉపసర్పంచ్, గ్రామ పాలకవర్గ సభ్యులు, స్పెషల్ ఆఫీసర్ మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి సాంప్రదాయబద్ధంగా పూజా



కార్యక్రమాలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి పనులను ఘనంగా ప్రారంభించారు. ఈ వేడుకలో మహిళా సంఘాల (ఏూా) ప్రతినిధులు, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ ఇటిక్యాల రాజు మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి ఈ మహిళా సంఘ భవనాలు ఎంతో దోహదపడతాయని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి డిజిటల్ పద్ధతిలో వీటికి శంకుస్థాపనలు చేయడం అభినందనీయమన్నారు. మహిళా సాధికారతకు, వారి ఆత్మగౌరవానికి ఈ భవనాలు ప్రతీకలుగా నిలుస్తాయని, మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అద్భుతమని కొనియాడారు. మన ఆరెపల్లి గ్రామంలో ఈ భవన నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక ఎంపీడీవో (వీూబా) సమన్వయంతో, అత్యంత నాణ్యతా ప్రమాణాలతో, యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు భాగస్వాములు కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘాల అధ్యక్షురాళ్ళు, కార్యదర్శులు, వివిధ వార్డుల సభ్యులు, యువకులు మరియు గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చీర్లవంచలో మహిళా సంఘ భవన పనుల ప్రారంభోత్సవం

**గ్రామ సర్పంచ్ కొలుగూరి కిరణ్మయి మధు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం**

వేములవాడ/ ప్రజాదివాస్ మే 25
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ గ్రామంలో మహిళా సంఘ (ఏూా) భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.



రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి వర్చువల్ విధానం ద్వారా ఏకకాలంలో మహిళా సంఘ భవనాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలను ప్రారంభించిన నేపథ్యంలో, చీర్లవంచ గ్రామంలోని వీఓ బిల్డింగ్ వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొలుగూరి కిరణ్మయి మధు ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సాంప్రదాయబద్ధంగా కొబ్బరికాయలు కొట్టి పనులను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, గ్రామ పాలకవర్గ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో పాటు మహిళా సంఘాల (ఏూా) ప్రతినిధులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం.

**- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 41 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**

రాజన్న సిరిసిల్ల జిల్లా మే 25 ప్రజా దివాస్
ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 41 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.....ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ



ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

ముస్తాబాద్/మే 25 ప్రజా దివాస్



ముస్తాబాద్ మండల కేంద్రంలోనీ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షులు ఏళ్ళ బాల్రెడ్డి ఆధ్వర్యంలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పక్క ప్రణాళికతో సీఎంఆర్ఎఫ్ నిధులను పేద మధ్యతరగతి వాళ్లకు అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతుంది అన్నారు మండలానికి దాదాపుగా 22 చెక్కులు వచ్చాయి దీని ద్వారా 9 లక్షల 50వేల రూపాయల వరకు పేద మధ్యతరగతి వారు లబ్ధి పొందారు అన్నారు ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆత్మ కమిటీ చేర్మెన్ కొండం రాజిరెడ్డి,పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు,ఉచ్చిడి బాల్ రెడ్డి మిరుదొడ్డి భాను,రంజాని నరేష్,శీల ప్రశాంత్,షాదుల్ పాప, బండారి సాయి మహేష్,తదితరులు పాల్గొన్నారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ జిల్లా అధికారి

ముస్తాబాద్ /మే 25 ప్రజా దివాస్
పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ సంపత్ ఆకస్మిక తనిఖీ చేశారు.వారు మాట్లాడుతూ పోలియో రహిత భారత దేశం గా మనం ఇప్పుడు టీకాల వల్ల సాధ్యమైంది అని క్రమం తప్పకుండా నిర్దేశించిన సమయంలో నిర్దేశించిన మోతాదులో భారత దేశం అందించబడుతున్నా వ్యాక్సిన్ ను చిన్నపిల్లలు మరియు గర్భవతులు ఎట్టి పరిస్థితులలో నైనా టీకాలు తీసుకోవాలని తెలిపారు ఆరోగ్య సిబ్బంది మరియు ఆశ కార్యకర్తలు నిర్దేశించిన సమయంలో డ్యూ లిస్ట్ నిర్వహించి ప్రణాళిక ప్రకారం బుధవారం మరియు శనివారం చిన్నపిల్లకు, గర్భిణి స్త్రీలకు వ్యాక్సిన్ అందించాలని సూచించారు. ఇది వేసవి కాలం కావడంతో ఎట్టి పరిస్థితులలో ప్రతి సబ్ సెంటర్ లో ఓ ఆర్ ఎస్ కార్నర్ నిర్వహించి ప్రజలు అందరికి తప్పనిసరిగా ఓ ఆర్ ఎస్ ద్రావణం గురించి అవగాహన కల్పించాలి అని అన్నారు.ఈ కార్యక్రమం లో పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అఫీజా మరియు పి హెచ్ ఎన్ జ్యోతి , హెచ్ ఈ ఓ భూమయ్య, ఆరోగ్య పర్యవేక్షకుడు ప్రసాద్ పాల్గొన్నారు



# బావుసాయిపేట గ్రామంలో పెళ్ళైన మహిళ అదృశ్యం..

**- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**



కోనరావుపేట మండలం/ప్రజాదివాస్ మే 25
కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైన ఘటనపై కోనరావుపేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది.పోలీసుల కథనం ప్రకారం బావుసాయిపేట గ్రామానికి చెందిన భవాని (25) భర్త బొజ్జ అనిల్ ముదిరాజ్ కులానికి చెందిన మహిళా ఈనెల 23వ తేదీ ఉదయం ఆరు గంటల నుండి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె తండ్రి లాలా హనుమంతు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి అదృశ్యమైన మహిళ కోసం గాలింపు చర్యలు చేపట్టామని దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. భవాని ఆచూకీ తెలిసిన వారు వెంటనే కోనరావుపేట పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

# భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన కేసీఆర్ మనువడు హిమాన్షు


**స్నేహితులతో కలిసి భీమన్నకు కోడె మొక్కు చెల్లించుకున్న కేటీఆర్ తనయుడు...**



వేములవాడ
ప్రజాదివాస్ మే 25
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయం భీమేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు హిమాన్షు వారి స్నేహితులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా స్వామివారికి కోడె మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదొక్త ఆశీర్వచనం చేయగా ఆలయ ఈఓ స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

# చందుర్తి మండలం మల్యాలలో విషాదం.. బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య

చందుర్తి మండలం/ప్రజాదివాస్ మే 25



సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో సోమవారం విషాదం చోటుచేసుకుంది. మల్యాల గ్రామానికి చెందిన కాటూరి లచ్చవ్వ అనే డెబ్బై రెండేళ్ల వృద్ధురాలు బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. గత ఆరు నెలలుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, కరీంనగర్‌లోని అక్షయ హాస్పిటల్‌లో డయాలసిస్ చికిత్స పొందుతోంది. దీర్ఘకాలిక అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన లచ్చవ్వ, ఈరోజు రోజున మల్యాల గ్రామ సరిహద్దుల్లో ఉన్న మల్లారపు నారాయణ అనే వ్యక్తికి చెందిన వ్యవసాయ బావిలోకి దూకి ప్రాణాలు విడిచింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు చందుర్తి ఎస్సై రమేష్ వెల్లడించారు.

# పంచాయతీ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్



రాజన్న సిరిసిల్ల, మే -25 ప్రజా దివాస్
రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున సాధారణ బదిలీలో భాగంగా జిల్లాలోని 77 మంది పంచాయతీ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమక్షంలో జిల్లా పంచాయతీ రాజ్ అధికారులు ప్రక్రియను చేపట్టారు. మొత్తం 77 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి . వారికి నూతన గ్రామ పంచాయతీలను కేటాయించడం జరిగింది.కౌన్సెలింగ్ లో జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దిన్ సిబ్బంది పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో ఐఎంఎస్ భవనాలకు సీఎం శంకుస్థాపన

**- 103 ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణాలకు (వర్చువల్) శ్రీకారం**
**- 13 అంగన్వాడి కేంద్రాలకు (వర్చువల్) ప్రారంభోత్సవం**
**- జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులు**



రాజన్న సిరిసిల్ల, మే -25 ప్రజా దివాస్
రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 8 వేల ఇందిరా మహిళా శక్తి (ఐఎంఎస్) భవనాల నిర్మాణాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి (వర్చువల్) విధానంలో పండుగ వాతావరణంలో శంకుస్థాపన చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగాలిమహిళా సంక్షేమ వారోత్సవాలలి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 8 వేల ఇందిరా మహిళా శక్తి (ఐఎంఎస్) భవనాల నిర్మాణాలకు (వర్చువల్) విధానంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులు, మహిళా సమాఖ్య ల సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా మండలాల్లో 103 ఇందిరా మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (వర్చువల్) విధానంలో శంకుస్థాపన చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే 13 నూతన అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం పూర్తి కాగా, వాటిని వర్చువల్ విధానంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేయాలి

**- అన్ లోడింగ్ లో జాప్యం కాకుండా పర్యవేక్షణ చేయాలి**
**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- ధాన్యం కొనుగోళ్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్**



రాజన్న సిరిసిల్ల, మే-25 ప్రజా దివాస్
జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ శరవేగంగా పూర్తి చేయాలని, అన్ లోడింగ్ లో జాప్యం కాకుండా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, అన్ లోడింగ్ వేగవంతం చేయడం, గోదాంలలో నిల్వ చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సోమవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న పరిస్థితులు, ధాన్యం నిల్వ సామర్థ్యం వివరాలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ చేయాలని, నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైస్ మిల్లులకు టార్గెట్ ఇవ్వాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని సూచించారు. రైస్ మిల్లులు, గోదాంలు, అపెరల్ పార్క్ లో హమాలీల సంఖ్యను పెంచి, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. తుది దశలో ఉన్న కేంద్రాల్లో కొనుగోళ్ల మరింత వేగవంతం చేసి.. పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలో గన్నీ బ్యాగుల కొరత లేదని, కేంద్రాల వారీగా ఎన్ని గన్నీ బ్యాగులు అవసరం ఉన్నాయో ముందే తెలుసుకుని, సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు తరలించేందుకు సరిపడా వాహనాలను సమకూర్చాలని, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు ఈ దిశగా వాహనాలు సమకూర్చేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

# అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- 300 దరఖాస్తుల రాక**



రాజన్న సిరిసిల్ల, మే - 26 ప్రజా దివాస్
ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మొత్తం దరఖాస్తులు 300 వచ్చాయి.సద్వినియోగం చేసుకోవాలి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలలోనూ ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రాజేందర్ రెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 9 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 12 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

**- ఎండ తీవ్రతతో మృతి చెందినట్లు అనుమానం**
**- వివరాలు తెలిస్తే వేములవాడ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరిన ఇన్‌స్పెక్టర్**



వేములవాడ / ప్రజాదివాస్ మే 25
వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్ స్టాండ్ సమీపంలో ఈ రోజు ఒక గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలి వయస్సు సుమారు 25 నుండి 30 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, ప్రాథమిక విచారణ ప్రకారం ఆమె ఎండ తీవ్రత (ాబఅ ో్తీశీనివ) కారణంగానే మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు.ఈ మృతురాలికి సంబంధించిన వివరాలు గానీ, ఆమె ఎవరనే సమాచారం గానీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే వెంటనే వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు. మృతురాలిని గుర్తించడానికి వీలుగా ఆమె వివరాలు, ఫోటోలను ఇప్పటికే అన్ని పోలీస్ స్టేషన్‌లకు మరియు మీడియాకు పంపించినట్లు తెలిపారు. సమాచారం ఉన్న వారు 8712656413 నంబర్‌లో వేములవాడ టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించవచ్చు.

# తిరుమలకుంటలో అంబరాన్నంటిన ఆదివాసుల 'భూమి పండుగ'

**- తిరుమలకుంటలో వైభవంగా భూదేవి ఉత్సవాలు**
**- ప్రకృతిని, నమ్ముకున్న నేలను పూజించిన గిరిజనులు**
**- వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ప్రత్యేక ప్రార్థనలు**
**- సాంప్రదాయ నృత్యాలు, కోలాటాలతో మార్మోగిన గిరిజన పల్లె**

ప్రజాదివాస్

ఆదివాసుల విశిష్ట సంస్కృతీ సంప్రదాయాలకు, వారి జీవన విధానానికి అద్దం పట్టేలా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామ పంచాయతీలో "భూమి పండుగ" (భూదేవి పండుగ) సోమవారం అత్యంత వైభవంగా, కోలాహలంగా జరిగింది. ఏటా రుతుపవనాలు రాకముందే కొత్త వ్యవసాయ సీజన్ ప్రారంభానికి సంకేతంగా గిరిజనులు ఈ పండుగను జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. తాము సాగు చేసే భూతల్లిని పూజించిన తర్వాతే నాగలి పడతారనే గాఢమైన నమ్మకం వీరి సొంతం. ఈ ఏడాది కూడా వరుణ దేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురవాలని, సాగు పనులు లాభసాటిగా సాగాలని, గ్రామంలో ఎలాంటి విపత్తులు రాకుండా ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకుంటూ భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు గ్రామ సర్పంచ్ కోర్స రాజేష్, గ్రామ పెద్దలు నారాం బొంజారావు, మోడియం వీరేశ్వరావుల ఆధ్వర్యంలో ఉదయాన్నే పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ పొలిమేరలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో గిరిజన పూజారులు భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూమిని తవ్వి అందులో నైవేద్యాలు, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాబోయే పంటకాలానికి ఉపయోగించే విత్తనాలకు పూజలు చేసి వాటిని పొలాల్లో చల్లేందుకు సిద్ధం చేశారు. గిరిజన నృత్యాలు.. రేలా రేలా పాటల కోలాహలం ఈ పండుగలో ప్రధాన ఆకర్షణగా గిరిజనుల సాంప్రదాయ నృత్యాలు నిలిచాయి. మహిళలు, యువతులు తమ సంప్రదాయ వస్త్రధారణలో ముస్తాబై, ఒకరి చేతులు మరొకరు పట్టుకుని వలయాకారంగా తిరుగుతూ 'రేలా రేలా' పాటలకు స్టెప్పులేశారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ కలిసి నృత్యాలు చేయడంతో తిరుమలకుంట గ్రామం పులకించిపోయింది. పురుషులు కూడా తమ సాంప్రదాయ వాయిద్యాలను వాయిస్తూ, బాణాలు, విల్లంబులు ధరించి నృత్యాలు చేస్తూ ఉత్సాహాన్ని నింపారు. ప్రకృతిని దైవంగా భావించే జీవనశైలి ఈ సందర్భంగా గ్రామ పెద్దలు నారం పోతయ్య, మడకం ముత్యాలరావు, మోడియం రమేష్ మాట్లాడుతూ.. "మా ఆదివాసుల జీవితం ప్రకృతితోనే ముడిపడి ఉంటుంది. అడవిని, భూమిని మేము దైవంగా భావిస్తాం. భూదేవిని



సంతోషపరిస్తేనే మాకు తిండి దొరుకుతుందని మా నమ్మకం. తరతరాలుగా వస్తున్న ఈ ఆచారాన్ని నేటి తరం యువత కూడా గౌరవిస్తూ పండుగను ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు. ఈ పండుగ కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, మానవునికి ప్రకృతికి ఉన్న విడదీయరాని బంధానికి ప్రతీక అని వారు చాటిచెప్పారు. అడవికి వేట.. సామూహిక విందు భూమి పూజ ముగిసిన అనంతరం ఆదివాసి సంప్రదాయం ప్రకారం గ్రామస్తులంతా కలిసి అడవికి వేటకు వెళ్లడం, అనంతరం తెచ్చిన ప్రసాదాలను, నైవేద్యాలను గ్రామస్తులంతా సామూహికంగా పంచుకుని విందు ఆరగించడం ఈ పండుగలో ప్రత్యేకతగా నిలిచింది. ఈ వైభవ వేడుకల్లో గ్రామ ప్రముఖులు కోర్స ముత్యాలరావు, పొట్ట నాగేంద్ర, మోడియం పుల్లప్ప, మాడి రమేష్, మోడియం శ్రీను, కోర్స జోగారావులతో పాటు స్థానిక రైతులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను జయప్రదం చేశారు. పండుగ సంబరాలతో తిరుమలకుంట గ్రామంలో పల్లె అందాలు, ఆదివాసి సంస్కృతి ఉట్టిపడ్డాయి.

# వివోఏ జేఏసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె కొనసాగింపు

ప్రజాదివాస్



వివోఏ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుండి నిరవధిక సమ్మె ప్రారంభమైనట్లు నాయకులు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాన డిమాండ్లు ఇవే: వివోఏలకు కనీస వేతనం రూ. 20,000 చెల్లించాలి. వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలి. అర్హులైన వివోఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలి. వివోఏలకు రూ. 20 లక్షల సాధారణ ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలి. ట్యాబ్‌లు మరియు నెట్ సౌకర్యం అందించాలి. 58 జీవోను సవరించాలి. అదేవిధంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. గౌరవ వేతనం మాకొద్దు.. కనీస వేతనం కావాలి, ఉద్యోగ భద్రత మా హక్కు, వివోఏలకు పనిభారం తగ్గించాలి అంటూ నినాదాలు చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, కోశాధికారి అలివేలు తదితర వివోఏలు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వాంకిడి ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా

**- భారతీయ జనతా యువమోర్చా తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలగతి సుచిత్**

ప్రజాదివాస్



మండల కేంద్రంలో ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా చేపట్టిన బిజెపి

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన తెలంగాణ రాష్ట్రంలోనే మాత్రం ఫర్టిలైజర్ ఫార్మర్ బుకింగ్ యాప్ లో యూరియాని బుక్ చేస్తే ఒక ఎకరానికి రెండు బస్తాల యూరియా మాత్రమే ఇస్తున్నారు ఈ విధానం ద్వారా రైతులకి యూరియా సరిపడక చాలా ఇబ్బందిగా పరిసితులు ఏర్పడుతున్నాయి కావున మన పక్క రాష్ట్రాల్లో అయినా మహారాష్ట్రలో కావచ్చు తమిళనాడు కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది. అదేవిధంగా ఫర్టిలైజర్ ఫార్మారి యాప్ ని తొలగించి రైతులకు గతంలో మాదిరి సరిపడా యూరియా ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పెందోర్ మారుతి కోట్నాక్ రాంశావ్ వాంకిడి మండల ప్రధాన కార్యదర్శి రామగిరి విశాల్ మండల ఉపాధ్యక్షులు ఏకబిల్వం నరేందర్ బీజేవైఎం మండలాధ్యక్షుడు మండోకర్ వికాస్ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు దుర్గం వానేష్ రైతులు పూసం శంకర్ సీడం పగ్గు చందన్ షావ్ కొట్టిన కిస్టు భీమ్రావు దాది రావు తదితరులు పాల్గొన్నారు

# మహిళల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్న తెలంగాణ ప్రజా ప్రభుత్వం

**- వివో సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన : గావించిన ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్**

ప్రజాదివాస్

మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న తెలంగాణ ప్రజా ప్రభుత్వం అని ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు సోమవారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని ల్యాగలమర్రి గ్రామంలో స్థానిక సర్పంచ్ ఎలుకతుర్తి రవితో కలిసి ఐకెపి మహిళా వి ఒ సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ద్వారా తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రతిపాదన మేరకు



పెగడపల్లి మండలంలో 23 గ్రామాలకు గాను 33 వివో సంఘ భవనాలు నిర్మాణం చేయడానికి మంజూరు ఇచ్చారని అందులో భాగంగా ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ఆన్లైన్ ద్వారా ఒకవైపు సంఘాలను ప్రారంభిస్తూ అన్ని మండల కేంద్రాల్లో వివిధ గ్రామాలకు మంజూరు ఇచ్చిన గ్రామాల్లో వివో సంఘ భవనాలకు భూమి పూజ చేయాలని ఆదేశాల మేరకు శంకుస్థాపన చేయడం జరిగిందని వివరించారు దాదాపు మనం పెగడపల్లి మండలంలో మూడు కోట్ల 30 లక్షల రూపాయల విలువగల సంఘ భవనాలు నిర్మాణం కోసం ఈ రోజు వివిధ గ్రామాలలో సర్పంచులు స్థానిక మహిళ వివో అధ్యక్షులు మరియు సీసీలు ఏపిఎం లా ఆధ్వర్యంలో శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెట్ల కిషన్ వివో సంఘం అధ్యక్షురాలు రాణి మహిళా సంఘాల ప్రతినిధులు పంచాయతీ కార్యదర్శి శంకర్ సి ఏ దేవారం కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కల్లేపల్లి రాజు నాయకులు పాపిరెడ్డి కోల రాజయ్య గ్రామస్తులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు

13

# కామారెడ్డి మున్సిపాలిటీపై అధికారం ఎవరిది..?

ప్రజాదివాస్ కామారెడ్డి మే 25:

కామారెడ్డి మున్సిపాలిటీలో ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి (కేవీఆర్) మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షపై మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి అభ్యంతరం వ్యక్తం చేయడం వివాదానికి దారితీసింది. దీంతో "మున్సిపాలిటీపై అసలు అధికారం ఎవరిది?" అనే ప్రశ్న ప్రజల్లో చర్చకు వచ్చింది. భారత రాజ్యాంగంలోని 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం మున్సిపాలిటీలు స్వతంత్ర స్థానిక సంస్థలుగా ఏర్పాటయ్యాయి. ప్రజల చేత ఎన్నుకోబడిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లు కలిసి పట్టణ పరిపాలనను నిర్వహించే హక్కు కలిగి ఉంటారు. పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, పన్నులు, నిర్మాణ అనుమతులు వంటి అంశాలపై నిర్ణయాధికారం మున్సిపల్ పాలకవర్గానిదే. అయితే, స్థానిక ఎమ్మెల్యేకు కూడా పరోక్షంగా కీలక పాత్ర ఉంటుంది. ఎమ్మెల్యే మున్సిపాలిటీలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఉంటారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ నిధుల మంజూరు, అభివృద్ధి పనుల ఆమోదం,




ప్రత్యేక గ్రాంట్లు, రోడ్లు, డ్రైనేజీ, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాల్లో ఎమ్మెల్యే సిఫార్సులు ప్రభావం చూపుతాయి. ప్రభుత్వ అధికార యంత్రాంగంపై కూడా ఎమ్మెల్యేకు రాజకీయ ప్రాధాన్యం ఉంటుంది. దీంతో మున్సిపాలిటీ పరిపాలనలో ఎన్నికైన స్థానిక సంస్థ ప్రతినిధుల అధికారమా..? లేక ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే పర్యవేక్షణాధికారమా..? అన్న అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, మున్సిపాలిటీ ఒక స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థ అయినప్పటికీ, ప్రజా అవసరాలు మరియు అభివృద్ధి నిధుల దృష్ట్యా స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం అవసరమే. రెండు వర్గాలు పరస్పర సహకారంతో పనిచేస్తేనే పట్టణ అభివృద్ధి వేగవంతం అవుతుందని వారు సూచిస్తున్నారు.

# ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న ఏజెన్సీ విద్యార్థులు ఈ కళాశాల ప్రవేశాలకు అర్హులు

ప్రజాదివాస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 25



గిరిజన ఉపాధ్యాయ డి. ఎడ్ కళాశాల భద్రాచలం నందు ఇటీవల ప్రవేశ ప్రకటన విడుదల చేయడం జరిగినదని ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకొన్న ఏజెన్సీ విద్యార్థులు ఈ కళాశాల ప్రవేశాలకు అర్హులని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన కొంతమంది విద్యార్థులకు సర్టిఫికెట్లు రాని కారణంగా దరఖాస్తులు చేసుకొని వారికి వెసులుబాటు కల్పిస్తూ విద్యార్థులు దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 30 వ తారీకు వరకు గడువు పొడిగించడం జరిగిందని ఆయన అన్నారు. కావున విద్యార్థులందరూ ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలుపుతూ అడ్మిషన్ సంబంధించి సమాచారం కోసం 83099 72776 ఫోన్ నెంబర్ను సంప్రదించ వలసిందిగా ఆయన కోరారు.

# జహీరాబాద్‌లో భారీ వర్షం: విరిగిపడిన వృక్షాలు, నిలిచిన రాకపోకలు



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రజాదివాస్

ఝరాసంగం:మండల కేంద్రంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. తీవ్రమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గాలివాన ధాటికి ఝరాసంగం పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం ముందున్న భారీ వృక్షాలు ఒక్కసారిగా విరిగిపడ్డాయి.చెట్లు విరిగి రోడ్డుపై పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కాలినడకన వెళ్లే దారులపై కూడా కొమ్మలు విరిగిపడటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న అధికారులు ఝరాసంగం సర్పంచ్ బల్ రాజ్ తో పటు భూపన్నపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ సంగమేశ్వర్ రెడ్డిరహదారిపై పడిన చెట్లను జెసిబి తో తొలగించి, రాకపోకలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు..

# రాష్ట్ర మంత్రులు శ్రీ దామోదర్ రాజనర్సింహ, శ్రీమతి కొండ సురేఖ సంగారెడ్డి జిల్లా పర్యటన

సంగారెడ్డి జిల్లా/ ప్రజాదివాస్ / మే 25



ఈ పర్యటనలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో 32 లక్షల 23 వేల రూపాయల కంపా నిధులతో నిర్మించిన అటవీ శాఖ బీట్ ఆఫీసర్స్ వసతి గృహాలను ప్రారంభించారు.అనంతరం, ఒక 1కోటి 44 లక్షల రూపాయల జూా –ాణ నిధులతో నిర్మించిన జిల్లా పరిరక్షణ అధికారి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో అడవుల పరిరక్షణ, వాతావరణ సమతుల్యతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. జిల్లాలో అందులో భాగంగా అర్బన్ ఎకో పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్ లలో అర్బన్ ఎకో పార్కులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం జిల్లా కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో అటవీశాఖ జిల్లా సంరక్షణ అధికారి కార్యాలయాన్ని నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య సంరక్షణ అధికారి సువర్ణ,ాజఖీ ప్రియాంక వర్గీస్, ౧+××జ చైర్ పర్సన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరతోష్ పంకజ్, మున్సిపాలిటీ చైర్పర్సన్ వనిత సంతోష్, సదాశివ పేట చైర్ పర్సన్ అంజమ్మ సత్యనారాయణ, జిల్లా అటవీ శాఖ సంరక్షణ అధికారి ప్రసాద్ రెడ్డి, ఞూా సత్తయ్య, ఖీ=ూ దేవీలాల్ , స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సిరిపురంలో ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం.

హత్నూర మే 25 ప్రజాదివాస్



సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం లోని సిరిపురం గ్రామంలో నూతన ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో కొత్త ఆధార్ కార్డ్‌ల నమోదు, పేరు, పుట్టిన తేదీ సవరణలు, మొబైల్ నంబర్ లింక్, బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా సిరిపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఆధార్ కష్టాలు తీరనున్నాయి. ప్రొప్రైటర్ చంద్రమోహన్ రెడ్డి, ఆపరేటర్ పూల సౌమ్య ఆధ్వర్యంలో నడిచే ఈ కేంద్రాన్ని మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు ప్రారంభించి, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

**– బీజేపీపై కేటీఆర్, హరీష్ రావు, జీవన్ రెడ్డిలు ఎందుకు మాట్లాడంలేదు..?**
**– వరి ధాన్యం, మక్కజొన్నల కొనుగోలుపై కేంద్రం ఎందుకు స్పందించడం లేదు.. ?**
**– జగిత్యాల జిల్లా కేంద్రంలో పెట్రోల్ డీజిల్ ధర పెంపుపై నిరసన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి. లక్ష్మణ్ కుమార్**



ప్రజాదివాస్ జగిత్యాల జిల్లా మే 25

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనె తగ్గించాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు నందయ్య ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర వెల్మ సంక్షేమ సంఘం అధ్యక్షులు,కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా కదిలివచ్చి పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తు జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగిత్యాల ఆర్డీఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడి పాలిట శాపంగా మారాయని మంత్రి అడ్లూరి అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో రాజకీయాలు చేయడం తప్ప పేద ప్రజల సంక్షేమం ఏనాడు పట్టించుకోవడంలేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి మోడి పెట్రోల్, డీజిల్ ధరల విషయం మాట్లాడలేదని స్పష్టం చేశారు ఇటీవల జరిగిన తమిళనాడు, కేరళ మరియు పచ్చిమబెంగాల్ ఎన్నికల పూర్తి అయిన తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని మంత్రి ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోడి ప్రభుత్వం దేశ ప్రజలు ఎవ్వరు విలాసవంతాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చిందని దీని అర్థం మన దేశ ఆర్థిక వ్యవస్థ అస్థవ్యస్తంగా మారిందని భావించవచ్చని మంత్రి అడ్లూరి అన్నారు. రూపాయి విలువ రోజు రోజుకు పడిపోతున్న మోడి మాత్రం నిద్ర లేవడం లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగాఉన్న బీఆర్ఎస్ పార్టీ నరేంద్ర మోడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడం లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు, జీవన్రెడ్డిలు ఎందుకు బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడం లేదని మంత్రి ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు బండి భగీరథ్ అంశంపై ఎందుకు బీఆర్ఎస్ నాయకులు నోరు మోదపడం లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు . బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండు ఒక్కటేనని మంత్రి అడ్లూరి అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పెట్రోల్, డీజిల్ ధరల పెంపు మీద ఉన్న దృష్టి ధాన్యం కొనుగోలు, మక్కల కొనుగోలుపై లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. రైతుల వద్ద నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు పంటల వడ్లు కొనుగోలు చేస్తే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోఉన్న ఎఫ్ సీ ఐ మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నుంచి బియ్యం సేకరించడం లేదని మంత్రి అడ్లూరి అన్నారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మిగిలిన లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని రాష్ట్రంలో రైతుల వద్ద కొనుగోలు చేసిన మక్కలతో పాటు ఎఫ్ సీ ఐ ద్వార బియ్యం సేకరించాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగ రావు, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్య , రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు కోమిరెడ్డి విజయ్ ఆజాద్ కోరుట్ల మెట్పల్లి మున్సిపల్ చైర్మన్లు తిరుమల వసంత గంగాధర్ లింబాద్రి జగిత్యాల మున్సిపాల్ చైర్మన్ సమిండ్ల వాణితో పాటు జగిత్యాల జిల్లాలోని పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# కామారెడ్డిలో ఘనంగా టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు..

ప్రజాదివాస్ కామారెడ్డి మే 25:

కామారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా ఐరేని సందీప్ మాట్లాడుతూ, బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ రాజకీయ ప్రస్థానం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ఆదర్శమని పేర్కొన్నారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి విద్యార్థి దశలోనే ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన, యూత్ కాంగ్రెస్ సెక్రటరీగా, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఎమ్మెల్సీగా పలు కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షుడిగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని కొనియాడారు.అలాగే ప్రజా ప్రభుత్వానికి, పార్టీ యంత్రాంగానికి మధ్య సమన్వయ వారధిగా నిలుస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మహేష్ కుమార్ గౌడ్ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు అంజాద్, సత్యం, అన్వార్, లడ్డు, కో-ఆప్షన్ సభ్యులు



ముబాషీర్ అలీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజా గౌడ్, ఇప్పశ్రీనివాస్, పర్వేజ్, మాజీ కౌన్సిలర్లు మాసూద్, రవి కుమార్, కిషన్ రావు, భాను, ప్రవీణ్ రెడ్డి, సురేష్, భరత్, భాస్కర్, జమీల్, శంకర్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయ కార్యదర్శి లక్క పత్తిని గంగాధర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన.. వాహనాలపై కూలిన చెట్

ఝరాసంగం మండలం ప్రజాదివాస్

ఝరాసంఘం మండల కేంద్రంలో సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి బలమైన ఈదురుగాలులు, గాలి వానతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.బలమైన గాలుల ప్రభావంతో చెట్ల కొమ్మలు ఒక్కసారిగా విరిగి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిలిపి ఉంచిన కారుపై పడటంతో వాహనం వెనుక భాగం దెబ్బతిన్నట్లు సమాచారం. ఘటన సమయంలో భారీ వర్షం కురుస్తుండటంతో స్థానికులు, పోలీసులు అప్రమత్తమై పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించింది.ఈదురుగాలుల తీవ్రతకు పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగి రహదారులపై




పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ తీగలు కూడా చెట్ల కొమ్మలతో చిక్కుకుపోవడంతో విద్యుత్ సరఫరాపై ప్రభావం పడినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.పోలీస్ స్టేషన్ ఆవరణలో పడిపోయిన చెట్ల కొమ్మలను తొలగించేందుకు సిబ్బంది చర్యలు చేపట్టారు. వాహనానికి జరిగిన నష్టాన్ని అంచనా వేస్తుండగా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.స్థానిక ప్రజలు కూడా గాలి వానల సమయంలో చెట్ల కింద నిలబడకుండా, విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

**- డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల**
**- కాంగ్రెస్ పార్టీ డివిజన్ స్థాయి సమావేశాల్లో పాల్గొన్న కొత్వాల**



ప్రజాదివాస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 25
రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను విస్తృత ప్రచారంతో ప్రజలకు వివరించాలని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ డివిజన్ పరిధిలోని 36వ డివిజన్ గట్టాయిగూడెంలో, 9వ డివిజన్ పెటచెర్వులో కాంగ్రెస్ పార్టీ డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో కొత్వాల తోపాటు డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్లలోపు ఉచిత కరెంట్, ఇందిరమ్మ గృహాల నిర్మాణం, 4 లక్షల రేషన్ కార్డుల పంపిణీ, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నరకం ధాన్యంపై క్వింటాకు 500 రూపాయలు బోనస్, రైతు భీమావంటి సంక్షేమ పథకాలు చేపడుతుందన్నారు. జూన్ 2వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా 2 లక్షల మందికి ఫింక్షన్లు పంపిణీ వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నదని, ఈ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు పైడిపల్లి జయలక్ష్మి, చరపా శాంతా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాలే జానకిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు నూకల రంగారావు, కోండం వెంకన్న గౌడ్, పి నరహరి, భట్టు మురళి, మహీపతి రామలింగం, పైడిపల్లి మహేష్, గుర్రం వెంకటరత్నం, వీర కుమార్, చరపా పాపారావు, కాపా శ్రీను, రేనాటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపిన జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్

ప్రజాదివాస్ నర్సంపేట: మే/25

వరంగల్ జిల్లా నర్సంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) కమిటీలో బీసీ లను గుర్తించి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి డైరెక్టర్లు గా 7 గురికి అవకాశం కల్పించడం పట్ల బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ఎమ్మెల్యే కు అభినందనలతో పాటు కృతజ్ఞతలు తెలియజేశారు. డైరెక్టర్లు గా అవకాశం పొందిన లక్కర్సు రమేష్ (నర్సంపేట), కీసరి వెంకటేశ్వర్లు(నర్సంపేట), కొలిపాక రాజయ్య(కమ్మపెల్లి), జినుకల సంపత్(రామారం), దామెర రవీందర్(ఆకుల తండ) మహిళా డైరెక్టర్లు కత్తి చైతన్య, (లక్నెపెల్లి), దోని కీర్తన, (నర్సంపేట) లకు డ్యాగల శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నూరి రవి ముదిరాజ్, జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, మండల నాయకులు మారపాక రమేష్ ముదిరాజ్, శీరంశెట్టి రాజేందర్ పెరక తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్న తెలంగాణ ప్రజా ప్రభుత్వం

**- వివో సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన : గావించిన కారుపోతుల సాయి దుర్గ అనిల్ గౌడ్**

ప్రజాదివాస్ దంతాలపల్లి
మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న తెలంగాణ ప్రజా ప్రభుత్వం అని కుమ్మరీకుంట్ల సర్పంచ్ కారుపోతుల సాయి దుర్గా అనిల్ పేర్కొన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో స్థానిక సర్పంచ్ కారుపోతుల సాయి దుర్గ అనిల్ కాకతీయ రుద్రమదేవి గ్రామ సంఘం సభ్యులతో కలిసి ఐకెపి మహిళా వి ఒ సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ చేసి అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ద్వారా ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ సహకారంతో మండలంలో 18 గ్రామాలకు గాను 15 గ్రామ సంఘాల బిల్డింగులు,ఎంఎస్ కార్యాలయం 1, స్టోరేజి 1,వివో సంఘ భవనాలు నిర్మాణం చేయడానికి మంజూరు ఇచ్చారని అందులో భాగంగా ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ఆన్లైన్ ద్వారా ఒకవైపు సంఘాలను ప్రారంభిస్తూ వివిధ గ్రామాలకు మంజూరు ఇచ్చిన గ్రామాల్లో వివో సంఘ భవనాలకు భూమి పూజ చేయాలని ఆదేశాల మేరకు శంకుస్థాపన చేయడంతో పాటు గ్రామ సంఘాల మహాసభను నిర్వహించడం జరిగిందని వివరించారు. దాదాపు గ్రామంలో లక్షల రూపాయల విలువగల సంఘ భవనాలు నిర్మాణం కోసం ఈ రోజు వివిధ గ్రామాలలో సర్పంచులు స్థానిక




మహిళ వివో అధ్యక్షులు మరియు సీసీలు, సత్యనారాయణ, వివో ఏలు చిల్ల నిరంజన్, మల్లేష్, రమేష్, ఆధ్వర్యంలో శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు .ఈ కార్యక్రమంలో కుమ్మరి కుంట్ల గ్రామ సర్పంచ్ కారుపోతుల సాయి దుర్గ, గ్రామస్తులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 138 దరఖాస్తులు స్వీకరణ..

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

ప్రజాదివాస్ కామారెడ్డి , మే 25:
ప్రతి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే




ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 138 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, భూ సంబంధిత సమస్యలను నేరుగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును సీరియస్‌గా పరిగణించి, సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు తీసుకుని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో ప్రధానంగా భూ వివాదాలు, పింఛన్ల మంజూరు, ఉపాధి అవకాశాలు, ధాన్యం కొనుగోలు సమస్యలు, కుటుంబ పరమైన వివాదాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన వినతులు వచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్ ఎన్.వి. గిరి, బాన్సువాడ మరియు ఎల్లారెడ్డి ఆర్డీవోలు, జెడ్పీ సీఈఓ చందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు జైలుకు తరలింపు

ప్రజాదివాస్ జగిత్యాల జిల్లా వెల్గటూరు మే 25
జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీస్ ఆదేశాల మేరకు, జగిత్యాల డిఎస్పి పురుషోత్తం రెడ్డి సూచనల మేరకు, ధర్మపురి సిఐ ఎ. రాంనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో ని జగిత్యాల జిల్లా వెలుగటూర్ ఎస్సై పి.ఉదయ్ కుమార్, తన సిబ్బందితో వెల్గాటూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనికిలో ఎండపల్లి మండలం అంబారిపేట గ్రామానికి చెందిన మోతే శేఖర్, గొల్లపల్లి మండలం బొంకూర్ గ్రామానికి చెందిన బత్తిని కృష్ణా రెడ్డి మరియు వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన ముచ్చెర్ల నాగరాజు అనువారు డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో పట్టుబడ్డట్లు స్థానిక ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన ముగ్గురిని వెల్గాటూర్ పోలీసు వారు పరీక్ష చేసి ధర్మపురి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జానకి ముందు హాజరు పరచగా, మేజిస్ట్రేట్ జానకి డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ వారు కృష్ణా రెడ్డి, నాగరాజు లకు అయిదు రోజుల జైలు శిక్ష మరియు శేఖర్ కు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపా , మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వారిని జగిత్యాల సబ్ జైలు కు తరలించడం జరిగినది అని తెలుపుతూ . ఈ సందర్భంగా ఎస్సై పి. ఉదయ్ కుమార్, మాట్లాడుతూ రోడ్డుపైన ప్రయాణించే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచిస్తూ, మద్యం సేవించి వాహనం నడుపరాదని, సీట్ బెల్ట్ తప్పకుండ ధరించాలని, అతివేగం నివారించడం మరియు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని, ఈ నిర్ణయాన్ని ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటాము అని తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత పట్ల అవగాహన ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు తదితరులు ఉన్నారు

# మల్కాపూర్ లో మహిళా వారోత్సవాలు

హత్నూర మండలం మే 25 ప్రజాదివాస్
సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం నాడు మల్కాపూర్ వెలుగు గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మహిళా వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా కిషోర బాలికల సంఘ సభ్యులతో పాటు వృద్ధ మహిళా సంఘం సభ్యురాళ్ళను మరియు చైతన్యం గా ఉన్న సాధారణ మహిళా సంఘం సభ్యులను సత్కరించడం జరిగింది. ఈసందర్భంగా సిసి రేణుకా మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోటిమంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేర్చడం ద్వారా అందరినీ అభ్యున్నతికి కృషి చేయాలనే సంకల్పంతో ఈ మహిళా వారోత్సవాలు ఈనెల 25నుంచి31 వరకు సాగుతాయన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు పావని, కార్యదర్శి లక్ష్మీ,ఎఎన్ఎం రాదాబాయి,విఒఎ ప్రమీల, గ్రూప్ లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే సునీతమ్మ చొరవ: పల్వనూరులో పొంగిన నీటి దారలు.

**- మా గోడు విని వెంటనే స్పందించినందుకు అమ్మకు రుణపడి ఉంటాం.**
**- బంటు రాయుడు గ్రామ సర్పంచ్.**

హత్నూర మండలం మే 25 ప్రజాదివాస్
సంగారెడ్డి జిల్లా, హత్నూర మండలం, పల్వానూరు గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా మంచినీటి కొరత ఉన్నది, గ్రామంలో గృహాలు, జనాభా ఎక్కువ పెరగడంతో,బోరుపట్ల నుండి వచ్చే మిషన్ భగీరథ నీళ్లు సరిగ్గా రాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవడంతో ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ బంటరాయుడు, ఉప సర్పంచ్ పట్లోళ్ల అన్నపూర్ణగారు, వార్డ్ మెంబర్లు గ్రామ పెద్ద మనుషులు గౌరవ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి బోర్ మోటర్ ను ఇవాళ గ్రామానికి పంపించి, బోర్ పాయింట్ చూసి బోర్ వేయగా పుష్కలంగా నీళ్లు బయటకు రావడంతో గ్రామస్తులు, గ్రామ పాలకవర్గం సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సునీతమ్మ ఇలాగే గ్రామ సమస్యల పైన స్పందిస్తే గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో, గ్రామపంచాయతీ పాలకవర్గం, మాజీ సర్పంచ్, బంటు శ్రీనివాస్, పెద్దలు గొల్లకిష్టయ్య, కుల్పగూరి లక్ష్మణ్, బంటు మల్లేశం, వడ్డె దశరథ, సత్తిరెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## నాగార్జున ఎమోషనల్: డిస్ట్రిబ్యూటర్ 'నెల్లూరు' హరి
## కన్నుమూత.. అక్కినేని ఫ్యామిలీ బలమైన అండను కోల్పోయింది



తెలుగు సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ (పంపిణీదారుడు), ఎగ్జిబిటర్, నిర్మాత 'నెల్లూరు' హరి అలియాస్ గుజ్జలపూడి హరికుమార్ (46) కన్నుమూశారు. ఆదివారం (మే 24, 2026) ఉదయం గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచారు. కేవలం 46 ఏళ్ల వయసులోనే హఠాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. దాదాపు రెండు దశాబ్దాలుగా పంపిణీ రంగంలో కీలక పాత్ర పోషించిన హరి ఆకస్మిక మరణం సినీ వర్గాలను సైతం దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

హరి పిక్చర్స్ ద్వారా ఎన్నో హిట్ చిత్రాలను హరికుమార్ పంపిణీ చేశారు. 2025లో 'సంక్రాంతికి వస్తున్నాం' సహా పలు సక్సెస్ ఫుల్ సినిమాల వెనుక కీలక పాత్ర పోషించారు. 2006లో రామ్ నటించిన 'దేవదాస్' సినిమాను తమిళనాడులో విడుదల చేసి వరుస సినిమాలను పంపిణీ చేసి సక్సెస్ అయ్యాడు. ఈ క్రమంలోనే హరి గత 20 ఏళ్లలో వందలాది చిత్రాలను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. టాలీవుడ్‌లోని అగ్ర నిర్మాణ సంస్థలైన అన్నపూర్ణ స్టూడియోస్, శ్రేష్ఠ మూవీస్, వైజయంతీ మూవీస్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ల నుంచి వచ్చిన పలు భారీ చిత్రాలను నెల్లూరు ప్రాంతంలో పంపిణీ చేస్తూ హరి ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఈ క్రమంలోనే హరి మృతిపై సినీ స్టార్స్, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

హరి మరణవార్త వినగానే అక్కినేని నాగార్జున తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆయనతో తనకు ఉన్న 25 ఏళ్ల సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ పోస్ట్ పెట్టారు.

"గుజ్జలపూడి హరికుమార్ మరణ వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి, విషాదానికి గురిచేసింది. మా పరిచయం 25 ఏళ్లకు పైగా ఉంది. అక్కినేని కుటుంబానికి ఆయన ఎప్పుడూ ఓ అండగా నిలిచారు. మా జీవితాల్లో ఆయన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. తెలుగు సినీ పరిశ్రమ ఒక గొప్ప డిస్ట్రిబ్యూటర్‌ను, అద్భుతమైన మనసున్న వ్యక్తిని కోల్పోయింది. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను" అంటూ నాగార్జున సంతాపం వ్యక్తం

## అది ఏమాత్రం మంచిది కాదు..
## ఎడ్యుకేషన్ సిస్టమ్‌పై పూరి మ్యూజింగ్స్



మార్కులకే ప్రాధాన్యమిస్తూ విద్యార్థులను కాంపిటేషన్ మోడ్‌లో ఉంచడం ఏమాత్రం మంచిది కాదని ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ పేర్కొన్నారు. పాఠశాల, కళాశాలల్లో సబ్జెక్టుల కన్నా ముందు జీవితం గురించి నేర్పాలని అభిప్రాయపడ్డారు. 'ఫ్యూచర్ ఎడ్యుకేషన్' పేరిట 'పూరి మ్యూజింగ్స్'లో విద్యావ్యవస్థపై మాట్లాడారు.

"నేటి మోడ్రన్ స్కూళ్లు పిల్లలకు అపారమైన జ్ఞానాన్ని అందిస్తున్నాయి. అయితే ఆ నాలెడ్జ్ విద్యార్థులను బలమైన వ్యక్తులుగా (మానసికంగా) తయారు చేసేందుకు ఉపయోగపడదు. ఇంటి పనులు ఎలా చేసుకోవాలన్నది ఎల్‌కేజీ నుంచే నేర్పాలి. శుభ్రత గురించి చెప్పాలి. ఐదేళ్లకే సమయపాలన, నిజాయతీ అంటే ఏంటో వివరించాలి. ప్రతి విద్యార్థికీ క్రమశిక్షణను నూరిపోయాలి. కుకింగ్ క్లాసెస్ కూడా ఉండాలి. వ్యాయామం, ఆటలు తప్పనిసరి చేయాలి. డిజిటల్ డిసిప్లిన్ గురించి చెప్పాలి.

ఇప్పటి స్కూళ్లన్నీ పరీక్షలు, మార్కులు, కంఠస్తం చేయడంపై దృష్టి పెడుతున్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ కన్నా ముందు సెల్ఫ్ కంట్రోల్, టైమ్ మేనేజ్‌మెంట్, ఎమోషనల్ బ్యాలెన్స్ లాంటి వాటిపై పాఠాలుండాలి. ఇవే వారికి జీవితంలో ఉపయోగపడతాయి. వారానికోసారి విద్యార్థులతో మెడిటేషన్ చేయించాలి. వయసుపెరిగేకొద్దీ.. ఒత్తిడిని ఎలా అధిగమించాలి? కోపాన్ని ఎలా కంట్రోల్ చేయాలి? అన్నవి చెప్పాలి. కమ్యూనికేషన్ ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. కనీసం మూడు భాషలు మాట్లాడేలా చూడాలి. మెంటల్ హెల్త్‌పై అవగాహన కలిగించేలా ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలి. అన్నింటికన్నా ముఖ్యంగా ప్రకృతిని ఎలా కాపాడుకోవాలన్నది చెప్పాలి. వీటి తర్వాతే మిగిలిన సబ్జెక్టులుండాలి. జీవితంలో కష్టం ఎదురైతే పాఠశాలలో చెప్పిన మోటివేషన్ క్లాస్ గుర్తురావాలి. అందుకే పిల్లల్ని మోటివేట్ చేసే టీచర్లు కావాలి. ఈరోజుల్లో ఏ డిగ్రీ అయినా అది బేసిక్ ఎడ్యుకేషన్ మాత్రమే. దానితో జీవితం మారిపోదు. దానికోసం చిన్నప్పటి నుంచీ పుస్తకాలను భుజాన మోయించాల్సిన అవసరం లేదు. మార్కుల కోసం వారిని కాంపిటీషన్ మోడ్‌లో పెట్టడం మంచిది కాదు. దీని వల్ల చిన్నప్పుడే ఆందోళనకు లోనవుతున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం.. మన దేశంలో ఏటా 13,000 నుంచి 15,000 మంది విద్యార్థులు సూసైడ్ చేసుకుంటున్నారు. అకడమిక్ ఒత్తిళ్లు, ఫెయిల్యూర్‌కి భయపడటం, కుటుంబం పెట్టుకున్న అంచనాలు, డిప్రెషన్‌లాంటివి ఇందుకు కారణం. ఇన్ని వేల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారంటే వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకోండి.

మన ఎడ్యుకేషన్ సిస్టమ్ మారాలి. పిల్లలు పర్సనల్‌గా స్ట్రాంగ్ కావాలి. పోలీసు అధికారులను స్కూళ్లు, కాలేజీలకు ఆహ్వానించి విద్యార్థులకు సివిక్ సెన్స్ నేర్పించాలి. చదువుకన్నా సంస్కారం ముఖ్యం. అందుకే సంస్కారం, మనోస్థైర్యం నేర్పే ఎడ్యుకేషన్ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అని అన్నారు.



## ఈవెంట్‌లో తడబడిన రామ్‌చరణ్.. క్రికెటర్‌కు క్షమాపణలు

ప్రముఖ నటుడు రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' మూవీ ఈవెంట్ లో శనివారం సాయంత్రం భోపాల్‌లో ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. అయితే, వేదికపై క్రికెటర్ల గురించి ఒక్క మాటలో చెప్పాలంటూ హోస్ట్ ర్యాపిడ్‌ఫైర్ నిర్వహించారు. ఈ క్రమంలో చరణ్ కాస్త తడబడ్డారు. జస్‌ప్రీత్ బుమ్రా కు తాను అభిమానిని అని చెప్పిన చరణ్.. ఆయన్ను ఫుట్‌బాల్ ప్లేయర్‌గా పేర్కొన్నారు. సంబంధిత క్లిప్పింగ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీనిపై స్పందిస్తూ రామ్‌చరణ్ క్షమాపణలు చెప్పారు."నేను కొన్నిసార్లు పేర్లను మర్చిపోతుంటా. జనసందోహం, అక్కడ హంగామా మధ్య అనుకోకుండా పొరపాటు జరిగింది. జస్‌ప్రీత్ బుమ్రాకు క్షమాపణలు. ఆయన్ను నేను గౌరవిస్తాను. ఆయన ఆటకు నేను పెద్ద ఫ్యాన్. బ్యాటర్లు వెనకడుగు వేసేలా మీ నిలకడైన ఆటతీరు భారతీయులంతా గర్వపడేలా చేస్తోంది" అని కొనియాడారు.ఈవెంట్ నిర్వహించిన ప్రాంతం విషయంలోనూ చరణ్ పొరపడ్డారు. భోపాల్‌కు బదులు బిహార్ అని ప్రస్తావించారు. అయితే, తన పొరపాటును

## 'దృశ్యం 3' కలెక్షన్ల సునామీ.. 3 రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి.. తగ్గేదే లేదంటూ భారీ వసూళ్లు



మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ నటించిన 'దృశ్యం 3' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ చిత్రం కేవలం మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. మే21న విడుదలైనప్పటి నుంచి ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ అనేక ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ షోలతో రన్ అవుతోంది. శనివారంతో మూడు రోజులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లతో మోహన్ లాల్ కెరియర్లో మరో బ్లాక్‌బస్టర్?గా నిలిచింది.

ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, క్రైమ్ థ్రిల్లర్ 'దృశ్యం 3' శనివారం (మే23న) ఒక్కరోజే రూ.13.70 కోట్ల నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇందులో మలయాళ వెర్షన్ నుంచి అత్యధికంగా రూ.11.65 కోట్లు రాగా, తెలుగు వెర్షన్ రూ.1.2 కోట్లు, తమిళం రూ.60 లక్షలు, కన్నడ వెర్షన్ రూ.25 లక్షలు వసూలు చేశాయి. దీంతో ఇండియాలో మూడు రోజుల్లో మొత్తం గ్రాస్ కలెక్షన్లు రూ.47.17 కోట్లకు చేరుకోగా, నెట్ కలెక్షన్లు రూ.40.60 కోట్ల వసూళ్లు నమోదు చేసింది.

ఓవర్సీస్‌లోనూ ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తోంది. శనివారం ఒక్కరోజే ఓవర్సీస్‌లో రూ.25 కోట్లు రాబట్టి, మొత్తం విదేశీ మార్కెట్లలో రూ.70 కోట్ల గ్రాస్ మార్క్ అందుకుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా మొత్తం గ్రాస్ కలెక్షన్లు రూ.117.17 కోట్ల క్లబ్?లో చేరి బాక్సాఫీస్ దండయాత్ర కొనసాగిస్తోంది. ముఖ్యంగా తమిళం, కన్నడతో పోలిస్తే తెలుగులోనే చిత్రానికి ఎక్కువ ఆదరణ లభించడం విశేషం.

దేశవ్యాప్తంగా 5,185 షోలలో ప్రదర్శితమవుతున్న ఈ చిత్రం మే 23న మొత్తం 50.2 శాతం ఆక్యుపెన్సీ నమోదు చేసింది. మలయాళ వెర్షన్‌కు అత్యధికంగా 66.52 శాతం ఆక్యుపెన్సీ నమోదవగా, తమిళ వెర్షన్‌కు 50.69 శాతం స్పందన లభించింది. తెలుగు వెర్షన్ 25.19 శాతం, కన్నడ వెర్షన్ 24.27 శాతం ఆక్యుపెన్సీ నమోదు చేశాయి. ఆడియన్స్ థియేటర్స్?కి




పోటెత్తడం చూస్తుంటే, 'దృశ్యం 3' మరో భారీ మైల్ స్టోన్ దిశగా దూసుకెళ్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సినిమాకి ఫస్ట్ డే కంటే సెకండ్ డే మౌత్ టాక్ ఊపందుకుంది. ఈ క్రమంలోనే మోహన్ లాల్ ఫ్యాన్స్ నుంచి థ్రిల్లర్ ఆడియన్స్ వరకు థియేటర్లో క్యూ కడుతున్నారు. అందువల్ల మేకర్స్ సైతం థియేటర్లు పెంచుతూ సినిమాపై మరింత హైప్ పెంచుతున్నారు. దర్శకుడు జీతు జోసెఫ్ ఈసారి కథలో సస్పెన్స్ కంటే జార్జికుట్టి కుటుంబ భావోద్వేగాలపై ఎక్కువ దృష్టి పెట్టారు. చివర్లో దృశ్యం 4కి సంబంధించిన హింట్ కూడా ఇవ్వడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది.

## పెద్ది డ్యాన్స్ ట్రై చేద్దామా.. ఇన్‌స్టా స్టోరీస్‌లో 'పెద్ది' పోస్టర్లతో ఆసీస్ క్రికెటర్ రచ్చ రచ్చ!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప' సినిమాలోని 'తగ్గేదే లే' డైలాగులు, సాంగ్స్‌కు రీల్స్ చేసి సోషల్ మీడియాలో రచ్చ లేపిన ఆస్ట్రేలియా డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆ రీల్స్‌తో తెలుగు ఆడియన్స్‌కు విపరీతంగా దగ్గరైన వార్నర్.. ఆ తర్వాత యంగ్ హీరో నితిన్ నటించిన 'రాబిన్ హుడ్' సినిమాలో ఒక క్రేజీ క్యామియో (ప్రత్యేక పాత్ర) రోల్ ప్లే చేసి వెండితెరపై కూడా అలరించాడు. ఇక రీల్స్‌తో మొదలైన వార్నర్ టాలీవుడ్ ప్రయాణం.. ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ రాబోయే మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'పెద్ది' కి అఫీషియల్ సపోర్ట్ ఇచ్చాడు.

రామ్ చరణ్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ లీడ్ రోల్స్ లో నటిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషనల్ కంటెంట్, అఫీషియల్ పోస్టర్లను డేవిడ్ వార్నర్ తన అధికారిక సోషల్ మీడియా అకౌంట్లలో షేర్ చేశాడు. ముఖ్యంగా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్లను పోస్ట్ చేస్తూ.. పెద్ది డ్యాన్స్ ట్రై చేద్దామా అని పోల్ పెట్టగా సుమారు 94 శాతం మంది'వం అని సమాధానం ఇచ్చారు. దీంతో మెగా ఫ్యాన్స్ వార్నర్ చేసిన పోస్టులను సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ చేస్తున్నారు.'ఆర్ఆర్ఆర్' తర్వాత రామ్ చరణ్ నటిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటిసారి చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తుండటం విశేషం. గతంలో 'పుష్ప', 'ఆర్ఆర్ఆర్' సినిమాలపై రీల్స్ చేసిన వార్నర్, ఇప్పుడు 'పెద్ది' సినిమాకు ఒక ప్రమోటర్ లాగా సపోర్ట్ ఇవ్వడం ఈ

## అవన్నీ ఫేక్... బాధ్యులపై చర్యలు

ఏఐ సహాయంతో అసభ్యకర రీతిలో తన ఫొటోలను సృష్టించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రముఖ కథానాయిక రుక్మిణీ వసంత్. వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించి ఇలాంటి ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానిస్తూ ఎక్స్ వేదికగా ఓ నోట్‌ని విడుదల చేశారు. "ఏఐ ఉపయోగించి సృష్టించిన నా ఫొటోలను ఆన్‌లైన్‌లో వైరల్ చేయడాన్ని నేను, నా టీమ్ గమనించాము. అవన్నీ ఫేక్. ఏఐతో చేసినవి అని స్పష్టం చేయదలుచుకున్నా. ఇలాంటి ఫొటోలు, కంటెంట్‌ని సృష్టించి ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యం. ఈ వ్యవహారాన్ని మేము తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఫొటోలు క్రియేట్ చేసిన వారితో పాటు, ఆన్‌లైన్ వేదికగా వైరల్ చేస్తున్న వారిపైనా న్యాయపరంగా, సైబర్ క్రైమ్ ద్వారా చర్యలు ప్రారంభించాం. ఇలాంటి కంటెంట్, ఫొటోలను ఆన్‌లైన్‌లో పంచుకోవడం మానుకోవాలని ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా" అని అందులో పేర్కొన్నారు. రుక్మిణి స్విమ్మింగ్ పూల్ వద్ద ఫొటోషూట్ చేయించుకుంటున్నట్లు ఉన్న కొన్ని ఫొటోలు, వీడియోలు వైరలవడంతో దీనిపై రుక్మిణీ తాజాగా స్పందిస్తూ ఫేక్ అని స్పష్టం చేశారు. సినిమా, పబ్లిక్ ఈవెంట్స్‌కు హాజరయ్యే నటీమణులను అభ్యంతరకర రీతిలో జూమ్ చేసి ఫొటోలు తీయడంపై రుక్మిణి ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రస్తుతం ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న 'డ్రాగన్' సినిమాలో నటిస్తున్నారు.

